# అభిమానం

**రైటర్స్ కాన్ఫరెన్స్‌కి** ఇన్విటేషన్ అందుకుని రాజమండ్రి వెళ్ళాను. ఆ రోజంతా సహ రచయితలతో సరదాగా గడిపి మర్నాడుదయాన్నే తిరుగు ప్రయాణమయ్యాను.

"రాత్రి మనింట్లో ఘోరం జరిగిపోయిందండీ" గడపలో కాలు పెడుతూనే బాంబు పేల్చింది ఇందుమతి.

జరిగిందేమిటో అర్థంకాక అయోమయంగా చూశాను.

"తెల్లవారితే మీరెలానూ వచ్చేస్తారు కదా అనుకుని మీ ఫ్రెండ్ కృష్ణ వస్తే ఉండిపొమ్మన్నాను.

"కృష్ణా!"

"అదేమిటండీ అలా నోరు వెళ్ళ బెడతారు? తరచూ మీకు ఉత్తరాలు రాస్తుంటాడు కదా కృష్ణ" అంటూ ఆగింది ఇందు మతి.

విషయం ఏమిటో ఎంతకీ వివరించకపోవడంతో నాకు చిర్రెత్తుకొచ్చింది.

"అసలేమైందో తొందరగా చెప్పి తగలడు" అన్నాను అసహనంగా.

"చెప్పనిస్తారా మరి. వాడేదో సుద్దాత్ముడనుకుని ఇంట్లో చోటిచ్చాను. తెల్లవారు ఝామున లేచి చూస్తే వాడు మంచం మీద కనిపించలేదు. అనుమానం వచ్చి బట్టల పెట్టె తెరిచి చూసాను. నా చంద్రహారం, దండవంకీ మాయమయ్యాయి. మీ స్నేహితుడు కదా అని నమ్మాను. దగుల్బాజీ వెధవ ఇంత మోసం చేస్తాడనుకోలేదు. లేకపోతే తన్ని తగిలేసేదాన్ని" అక్కసుగా పలికింది ఇందుమతి.

చెప్పా పెట్టకుండా నెల్లూరు నుంచి కృష్ణ రావడమేమిటి? దొంగతనం చేసి పారిపోవడమేమిటి? సాక్షాత్తు నా సహధర్మచారిణి చెప్పినా నా చెవులు నమ్మలేకపోతున్నాయి. కృష్ణ నా అభిమాని. కలం స్నేహితుడు. పైగా నా కథలంటే పడిచస్తాడు. నా రచన ఏ పత్రికలో పడ్డా ఎంతో ఆసక్తిగా చదివి దానిని విశ్లేషిస్తూ ఉత్తరాలు రాస్తుంటాడు. నేను వ్రాసిన ప్రతి కథలో సామాజిక స్పృహ, వాస్తవికత గోచరిస్తాయంటాడు. పొగడ్తలే కాదు, అప్పుడప్పుడు నిర్మాణాత్మక విమర్శలు కూడా చేస్తూ వుంటాడు. అందుకే వాడు రాసిన ప్రతి ఉత్తరానికి ఎంతో ఓపిగ్గా జవాబిస్తూ వుంటాను. అతడి వ్రాతల్లో నిజాయితీ తప్ప ఏ కోశానా వంచన కానరాదు. మరి అటువంటి వ్యక్తి నేను లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి నమ్మక ద్రోహానికి పాల్పడ్డాడంటే ఎలా విశ్వసించను? అందుకే వచ్చినవాడు కృష్ణే అని నువ్వెలా చెప్పగలుగు తున్నావంటూ ఎదురు ప్రశ్న వేశాను.

"నేను చెప్పడమేమిటండి, తనే కృష్ణనని చెబుతూ మిమ్మల్ని చూడాలన్న తపనతో నెల్లూరు నుంచి వచ్చానన్నాడు. అంతదూరం నుండి వచ్చిన మనిషిని పైగా మీ అభిమానిని పొమ్మనడానికి నోరు రాక వుండమన్నాను" అన్నది ఇందుమతి.

"సరే వాడెక్కడికి పోతాడు?" అంటూ టేబిలు సొరుగులోంచి అదివరకు వాడు రాసిన

ఉత్తరాన్నొకదాన్ని బయటకు లాగి ఎడ్రస్ నోట్ చేసుకున్నాను. వెంటనే వెళ్ళి వాడికి, నాకు ఉన్న సంబంధాన్ని తెలియపరుస్తూ పోలీసు రిపోర్టిచ్చాను. అంతే కాదు ఖర్చుల నిమిత్తం దండీగా డబ్బు కూడా ముట్టజెప్పాను. చేతిలో సొమ్ము పడేసరికి పోలీసులు పరమానంద భరితులై కేసు ఆసక్తిగా టేకప్ చేసారు.

నాలుగు రోజుల తర్వాత...

నన్ను నా భార్యని స్టేషన్‌కు రమ్మని కబురంపాడు ఎస్.ఐ.

దొంగ పట్టుబడి వుంటాడనుకుని రివ్వున వెళ్లి పోలీసు స్టేషన్లో వాలాం.

మమ్మల్లిన్ని చూస్తూనే 'రండి' అంటూ సెల్ వద్దకు తీసుకెళ్ళాడు ఎస్.ఐ.

కటకటాల వెనుక నిలబడ్డ వ్యక్తిని చూపిస్తూ "ఆరోజు మీ ఇంట్లో నగలు దొంగిలించింది వీడేనా?" అని అడిగాడు.

"అబ్బే వీడు కాదండి" అన్నది నా భార్య రపీమని.

"సరిగ్గా చూసి చెప్పండి" అన్నాడు ఎస్.ఐ.

"ఊహుం, అసలు వాడికి వీడికి పోలికే లేదు" అంటూ పెదిమ విరిచింది ఇందుమతి.

"కృష్ణని మీరెవ్వరూ చూడకపోవడమే ఈ అనర్థానికంతటికీ మూలకారణం" అన్నాడు ఎస్.ఐ.

"ఇంతకీ వీడెవడు?" అని అడిగాను వుండబట్టలేక.

"ఇంకెవరు? మీ పెన్‌ఫ్రెండ్ కృష్ణ" అంటూ "సుబ్బారావు గారూ! మీకు మీ ఫ్రెండ్‌కి మధ్య నడిచిన లేఖా ప్రహసనాన్ని పసిగట్టిన మూడవ వ్యక్తి ఎవరో కృష్ణావతారమెత్తి మీ ఇంట్లోకి ప్రవేశించాడు. వాడి మాటల్ని నమ్మి మీ ఆవిడ ఆతిథ్యమిచ్చింది. దొరికన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడా దొంగ వెధవ" నిజాన్ని నిగ్గుతేల్చాడు ఎస్.ఐ.

ఇనుప చువ్వలు పట్టుకుని అమాయకంగా చూస్తున్న కృష్ణమీద అమితమైన జాలి వేసింది. నగలు పోయాయని తెలిసినప్పుడు కూడా నేనంత బాధపడలేదు. ఓ నిరపరాధిని అపరాధిని చేసినందుకు నన్ను నేనే నిందించుకున్నాను.

"మీ రచనలకు ముగ్ధుడనై నిండు మనసుతో మీ స్నేహాన్ని ఆర్థించిన పాపానికా నాకీ శిక్ష" అంటున్నాయి అతడి అమాయకపు నయనాలు.

**( 28-10-99, ఆంధ్రభూమి వీక్లీ)**